# ఆహార ఉత్పత్తుల ముసుగులో.. నకిలీ మందులు

- కరీంనగర్ ఘటనతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- తార్నాకలోని ఎలియన్ హెల్త్‌కేర్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు
- రూ.93వేల విలువ చేసే 'ప్రెగబలిన్, మిథైల్కోబామిన్' క్యాప్సిల్స్ సీజ్



స్వాధీనం చేసుకున్న నకిలీ మందులు

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): అనుమతులేమో ఆహార ఉత్పత్తుల తయారీకోసం తీసుకున్నారు. కాని అక్కడ తయారు చేసేవి మాత్రం నరాల వ్యాధిగ్రస్తుల చికిత్సకు వినియోగించే ఔషధాలు. కొంత కాలంగా నడుస్తున్న ఈ నకిలీ మందుల తయారీ రాకెట్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు గుట్టు రట్టు చేశారు. డ్రగ్ కంట్రోల్ డీజీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... హర్యానాలోని బార్వీలో ఆహార ఉత్పత్తుల తయారీ ముసుగులో అక్షర్ మాలిక్యూల్స్ అనే సంస్థ అక్రమంగా ఔషధాలను తయారు చేస్తోంది. ఈ క్రమంలో'ఎన్యురాన్-పి'పేరుతో నరాల సమస్య చికిత్స కోసం వినియోగించే 'ప్రెగబలిన్' 'మిథైల్కోబామిన్' క్యాప్సిల్స్ తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ విధంగా తయారు చేసిన ఔషధాలను సికింద్రాబాద్, తార్నాకలోని ఎలియాన్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ ఉత్పత్తిలో 75ఎంజీల ప్రెగబలిన్, 750ఎంసీజీల మిథైల్కోబామిన్ ఔషధాలను వినియోగించినట్లు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు నిర్ధారించారు. ఈ రకమైన ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అథారిటీ అనుమతితోనే తయారు చేయాల్సి ఉండగా.. ఆహార ఉత్పత్తుల తయారీ కోసం తీసుకున్న అనుమతులతో తయారు చేయడం చట్టరీత్యా నేరమని డీసీఏ అధికారులు హెచ్చరించారు. అయితే గడిచిన నవంబర్‌లో ఈ నకిలీ ఔషధాలను కరీంనగర్‌లో డీసీఏ అధికారులు గుర్తించి, విక్రయదారులపై కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు అందించిన సమాచారం మేరకు తాజాగా తార్నాకలోని ఎలియాన్ హెల్త్‌కేర్‌పై దాడులు చేశారు. రూ.93వేల విలువ చేసే నకిలీ ఔషధాలను సీజ్ చేసి, లాబొరేటరీకి తరలించారు.



## డిప్యూటీ సీఎంను కలిసిన నిమ్స్ ఉద్యోగులు

నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ సంఘం అధ్యక్షుడు ఎ.సత్యగౌడ్ నేతృత్వంలో ఉద్యోగ సంఘం నాయకులు డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్, నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజ్ కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేశ్ తదితరులు ఉన్నారు.

- ఖైరతాబాద్, జనవరి 24



బంగ్లాదేశ్ రాయబార కార్యాలయ అధికారికి జ్ఞాపిక అందజేస్తున్న ఓయూ అధికారులు

## ఓయూను సందర్శించిన బంగ్లాదేశ్ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయ అధికారులు బుధవారం సందర్శించారు. దక్షిణ భారతదేశంలో బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ షెల్లీ సలేహి, సోషల్ సెక్రటరీ శ్రీశబరి ఓయూ పరిధిలో యూజీ కోర్సులు చదువుతున్న తమ దేశానికి చెందిన ఏడుగురు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఓయూ అధికారులతో సమావేశమయ్యారు. విద్యారంగంలో ఓయూతో సంయుక్త కార్యక్రమాలు ప్రారంభించేందుకు వారు ఆసక్తి కనబర్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివరామకృష్ణ, జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ సరితారెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, పీఆర్వో ప్రొఫెసర్ ప్యాట్రిక్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ

సిటీబ్యూరో, జనవరి 24(నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులకు ఉచిత వృత్తివిద్య శిక్షణతో పాటు, 3 నెలల పాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ పేర్కొంది. ఈ మేరకు ఉచిత శిక్షణకు ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయగా ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఆటోమొబైల్ రిపేర్, ఎస్కలేటర్ ఆపరేటర్, డ్రై వాల్ అండ్ ఫాల్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను 3 నెలలు వ్యవధితో, టైలరింగ్ కోర్సును రెండు నెలల వ్యవధితో అందిస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు క్యాంపస్‌లో ఉన్న స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా స్కూల్, కాలేజీ డ్రాపవుట్ విద్యార్థులకు తొమ్మిది విభిన్నమైన కోర్సుల ద్వారా వృత్తి నైపుణ్యాలను నిరుద్యోగ యువతకు అందజేస్తున్నారు. 18 ఏండ్లు ఉండి, బీపీఎల్ కుటుంబానికి చెందిన వారు అర్హులని, పదో తరగతి పాస్ లేదా, ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని,డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు తప్పనిసరిగా ఎస్సెస్సీ ఉత్తీర్ణత తప్పనిసరి పేర్కొన్నారు. శిక్షణ ముగిసిన తర్వాత స్పోకెన్ ఇంగ్లిష్ సాఫ్ట్ స్కిల్ ట్రైనింగ్ కూడా ఇస్తామని, 90శాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తామని నిర్వాహకులు తెలిపా రు. తాజాగా ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ నెల 26 లోపు 89858 00102 ద్వారా సంప్రదించాలని సూచించారు.



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన జి.వివేక్ వెంకటస్వామిని ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాలులో బుధవారం సన్మానించారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24



## 60 ఏండ్ల మహిళకు 3డి టెక్నాలజీతో మోకాలి మార్పిడి

జూబ్లీహిల్స్,జనవరి24 : నగరంలోని ఒమెగా హాస్పిటల్‌లో 60 ఏండ్ల మహిళకు '3 డి ఆగ్మెంటేడ్ రియాలిటీ-గ్లాస్సెస్' టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. ఫ్రాన్స్ దేశంలో అందుబాటులో ఉన్న ఈ అధునాతన టెక్నాలజీ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించడం తొలిసారని డైరెక్టర్ ఆఫ్ ఆర్థోపెడిక్ డాక్టర్ ఆదిత్య కపూర్ తెలిపారు. ఈ తరహా చికిత్స పూర్తయిన తరువాత ఒక్కరోజులోనే తిరిగి నడవగలుగుతారని.. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఈ టెక్నాలజీ ద్వారా వైద్యం అందించడం ఒక వరం లాంటిదని ఆయన వివరించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 24 : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్టీవో కిషన్‌తో కలిసి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రం, బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నిబంధనలు పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది క్షతగాత్రులు అవుతున్నారని, కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం అంత్యంత ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా మాసోత్సవంలో అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## ముగిసిన బిజినెస్ మేనేజ్‌మెంట్ స్వర్ణోత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రారంభమై యాభై ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాల ప్రారంభ వేడుకలు బుధవారం ముగిశాయి. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు రిటైర్డ్ ప్రొఫెసర్లు హాజరయ్యారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు మధుసూదన్‌రెడ్డి, హరగోపాల్, పన్నాలాల్, ఎస్ఎన్ శర్మ, వి.శేఖర్, పార్థసారథి, ఎస్ఎన్ మూర్తి, మల్లికార్జునరెడ్డి, ఆర్.నాగేశ్వర్‌రావు హాజరై తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, ప్రొఫెసర్ జహంగీర్, భానుమూర్తి, ప్రొఫెసర్ వెంకటయ్య, ప్రొఫెసర్ స్మిత సాంబ్రాణి, ప్రొఫెసర్ సంపత్‌కుమార్, డాక్టర్ విద్యాసాగర్ రావు, డాక్టర్ సమున్నత తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు సీఎం అభినందనలు





కేంద్ర క్రీడాశాఖ వార్షిక అవార్డుల్లో భాగంగా ఇటీవల అర్జున పురస్కారాలు అందుకున్న షూటర్ ఇషాసింగ్, బాక్సర్ హుసాముద్దీన్‌ను బుధవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. వీరితో పాటు జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పతకాలు సాధిస్తున్న యువ ప్లేయర్లు అగసర నందిని, జివాంజీ దీప్తి, సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి, గాయత్రి గోపీచంద్‌ను సీఎం అభినందించారు.













మాట్లాడుతున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

## జీఐఎస్ విధానం అమలుపై శిక్షణ

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను జలమండలి అందిపుచ్చుకుంటుంది. ఈ మేరకు గత నవంబర్‌లో జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) విభాగాన్ని ఏర్పాటు చేసింది. తాగు, మురుగునీటి నిర్వహణ, నెట్‌వర్క్ పర్యవేక్షణ, ప్లానింగ్ తదితర సంస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే 25 మంది జీఐఎస్ సిస్టం విధి విధానాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 22న ప్రారంభం కాగా బుధవారం శిక్షణ ముగిసింది. దీంతో ఎండీ సుదర్శన్‌రెడ్డి వారికి ధ్రువపత్రాలను అందజేశారు. శిక్షణ పొందిన వారిలో ఒక జీఎం సహా డీజీఎం, మేనేజర్లు ఉన్నారు. జీఐఎస్ సెల్‌తో క్షేత్రస్థాయిలో సెక్షన్ లెవల్‌లోనే సంబంధిత అధికారులు ఆ సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు. ఫలితంగా డేటా సంబంధిత అధికారులకు అందుబాటులో ఉండటంతో సమయం తగ్గి మెరుగైన సేవలను అందించే వీలు ఉంటుంది. శిక్షణ ముగింపు కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, సీజీఎం ఐటీ టీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న హర్షణీయం

- బీసీ సంఘాల నేతల హర్షం

హైదరాబాద్, జనవరి24 (నమస్తే తెలంగాణ): బీహార్ మాజీ ముఖ్యమంత్రి బడుగుల బాంధవుడు, బీసీల అభివృద్ధికి బాటలు వేసిన కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించడంపై బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

## దేశానికే టీఎస్ఆర్టీసీ రోల్ మోడల్

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): టీఎస్ఆర్టీసీని దేశానికే రోల్ మోడల్‌గా నిలపడంలో డ్రైవర్ల పాత్ర ఎనలేనిదని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ కొనియాడారు. బస్సు డ్రైవర్ల కృషిని గుర్తించే ప్రయత్నంలో టీఎస్ఆర్టీసీ బుధవారం బస్సు డ్రైవర్ల దినోత్సవం నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లను ఎండీ సజ్జనార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 20 వేల మంది ఆర్టీసీ డ్రైవర్లు, ప్రతిరోజూ 55 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఎనలేని కృషి ఉన్నదని ఆయన అభినందించారు. ఈ మేరకు డ్రైవర్లకు అభినందనలు తెలుపుతున్న ఫొటోను ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

## జెఎన్‌టీయూలో నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ ): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఉదయం 9 గంటలకు కూకట్‌పల్లి జెఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేసింది. బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డిప్యూటీ సీఈఓ లోకేశ్‌కుమార్, స్టేట్ ఎన్నికల కమిషనర్ పార్థసారథి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్,మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పాల్గొంటారని అధికారులు తెలిపారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మలక్‌పేట, జనవరి 24: రైతులకు గిట్టుబాటు ధరలతోపాటు వ్యాపారులకు మేలు చేకూర్చే విధంగా మార్కెట్ అధికారులతో కలిసి సమష్టి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలంగాణ చాంబర్ అగ్రి ట్రేడర్స్ నూతన అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ తెలిపారు. బుధవారం మలక్‌పేట మహబూబ్ మ్యాన్షన్ మార్కెట్‌లోని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, కోశాధికారి కొణిజేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రకాశ్, జగదీష్, ఎం.కృష్ణ, సంయుక్త కార్యదర్శులు సత్యలింగం, వెంకటేశం, సీహెచ్.శ్యాంరావులతో మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉప సంచాలకులు దామోదర్, మాజీ డైరెక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



## మా పొట్ట కొట్టొద్దు..

డీసీని నిలదీసిన కార్మికులు

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్‌ఎంసీ అధికారులపై కార్మికులు కన్నెర్ర జేశారు. గడిచిన 20 సంవత్సరాలుగా నాగోల్ డంపింగ్ యార్డులో చెత్త ఏరుకొని కాలం వెళ్లదీస్తున్న తమ పొట్ట కొడుతున్నారని, రాంకీ సంస్థకు కొమ్ముకాస్తున్నారంటూ ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను కార్మికులు అడ్డుకున్నారు. బుధవారం డంపింగ్ యార్డుకు వచ్చిన డీసీని కార్మికులు నిలదీశారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని డీసీతో వాదించారు. డంపింగ్‌యార్డును నమ్ముకుని జీవనం గడుపుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ నిర్వహణ పరిధిలో ఉన్నదని అధికారులు చెప్పినా కార్మికులు మాత్రం ప్రైవేట్ ఏజెన్సీకి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. చెత్త ఏరుకొని బతికే కార్మికులను ఆదుకోవాలని, కమిషనర్ రొనాల్డ్‌రాస్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు. లేదంటే జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామని కార్మికులు పేర్కొన్నారు.

## మారనున్న దేశ ఉన్నత విద్య స్వరూపం

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : నూతన విద్యా విధానం దేశ ఉన్నత విద్యా స్వరూపాన్ని మార్చనుందని, అందులో భాగంగానే విద్యార్థులకు మరింత ఉపయోగంగా నిలువాలనే ఉద్దేశంతో 'అవుట్ కం బేస్డ్ ప్రణాళికలు రూపొందించడం, ఎలా సమగ్రంగా ఉపయోగించుకోవాలి అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే సీతారామారావు తెలిపారు. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన 'అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై నిర్వహించిన మూడో రోజు ముగింపు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఎన్‌రెడ్డి, సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ కే శ్రీదేవి, ఓపెన్ యూనివర్సిటీ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వి.వెంకయ్య పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పనులు చేయలేం

- రూ.1200 కోట్ల బకాయిలు చెల్లించండి
- ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల వినతి

ఖైరతాబాద్, జనవరి 24 : ఏడాది కాలంగా తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 3,500 మంది చిన్న కాంట్రాక్టర్లు ఉన్నారని, జీహెచ్‌ఎంసీకి సంబంధించిన డీసిల్టింగ్, పార్కుల అభివృద్ధి, ఫుట్‌పాత్, వీడీసీసీ రోడ్ తదితర పనులు చేపడుతున్నామని తెలిపారు. గతేడాది ఫిబ్రవరి నుంచి నుంచి నేటి వరకు రూ.1,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం వెయ్యి కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయన్నారు. మళ్లీ రూ.500 కోట్లకు సంబంధించిన పనులకు సంబంధించి జీహెచ్‌ఎంసీ టెండర్లను ఆహ్వానించిందని చెప్పారు. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలయ్యామని, ఇద్దరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకోగా.. మరో ఇద్దరు గుండెపోటుతో మృతిచెందారన్నారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సురేందర్ సింగ్, కోశాధికారి ఎండి నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు జి.రమేశ్, ఎండి ఆరీఫ్ అహ్మద్, కల్యాణ్ చక్రవర్తి, అలీ అబ్బాస్, వసంత్ కుమార్, వేణుగోపాల్, సింహాద్రి, రవి తదితరులు పాల్గొన్నారు.





పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లు